క్లుప్తంగా

అభివృద్ధి, సంక్షేమాలకు సమ ప్రాధాన్యం

నిడదవోలు ఎమ్మెల్యే శ్రీనివాస్‌నాయుడు



ప్రారంభించిన సచివాలయ వద్ద ఎమ్మెల్యే శ్రీనివాస్‌నాయుడు, నాయకులు, సిబ్బంది

ఉండ్రాజవరం: రాష్ట్రాభివృద్ధి, ప్రజా సంక్షేమానికి ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి సమ ప్రాధాన్యం ఇస్తున్నారని నిడదవోలు ఎమ్మెల్యే జి. శ్రీనివాస్‌నాయుడు అన్నారు. మండలంలో వడ్లూరు గ్రామంలో రూ.40 లక్షల వ్యయంతో నిర్మించిన గ్రామ సచివాలయం భవనాన్ని మంగళవారం ఆయన ప్రారంభించారు. అనంతరం జల్‌జీవన్ మిషన్ కింద రూ.70 లక్షల వ్యయంతో నిర్మించే ఓహెచ్‌ఎస్‌ఆర్ ట్యాంకు, తాగునీటి కుళాయిలు, పైపులైన్ల పనులకు ఆయన శంకుస్థాపన చేసి శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. అలాగే నాడు- నేడు పథకంలో రూ.22.50 లక్షల వ్యయంతో వడ్లూరు ప్రాథమిక పాఠశాల-1లో చేసిన అభివృద్ధి పనులను ఎమ్మెల్యే ప్రారంభించారు. సర్పంచ్ రఘుమండ తేజశ్రీ, గృహ సారథుల మండల ఇన్‌చార్జ్ కఠారి సిద్ధార్థరాజు ఆధ్వర్యంలో నిర్వహించిన సభలో ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్ బూరుగుపల్లి సుబ్బారావు, జెడ్పీటీసీ సభ్యుడు నందిగం భాస్కరరామయ్య, ఎంపీపీ పాలాటి యల్లారేశ్వరి, ఎంపీటీసీ సభ్యుడు వేండ్ర రమేష్ తదితరులు పాల్గొన్నారు.

అమ్మఒడి చెక్ అందజేత

విద్యాభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం అధిక ప్రాధాన్యం ఇస్తోందని ఎమ్మెల్యే జి.శ్రీనివాస్‌నాయుడు అన్నారు. ఉండ్రాజవరం ఉన్నత పాఠశాల్లో హెచ్‌ఎం వి.విశ్వప్రసాద్ అధ్యక్షతన మంగళవారం జగనన్న అమ్మ ఒడి కార్యక్రమం నిర్వహించారు.ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్యే మండలంలోని 5,818 మంది విద్యార్థులకు రూ.13,000 చొప్పున రూ.7.57 కోట్ల చెక్కును ఆవిష్కరించారు. అనంతరం ఇంటరాక్టివ్ ఫ్లాట్ ప్యానల్ బోర్డును ఎమ్మెల్యే ప్రారంభించారు.

భీమదొర మురుగు కాలువ పనుల పరిశీలన

నిడదవోలు: పట్టణ నడిబొడ్డున పాటిమీద సెంటర్లోని భీమదొర మురుగు కాలువ స్థానంలో త్వరలో రోడ్డు నిర్మిస్తారు. ప్రస్తుతం కాలువ స్థానంలో రోడ్డు నిర్మాణ పనులకు పొక్లెయిన్‌తో శుభ్రం చేయిస్తున్నారు. ఈ పనులను మున్సిపల్ చైర్మన్ భూపతి ఆదినారాయణ అధికారులతో కలిసి మంగళవారం పరిశీలించారు. పనులను వేగవంతం చేయాలని ఆయన అక్కడి సిబ్బందిని ఆదేశించారు. కమిషనర్ కేవీ పద్మావతి, వైస్ చైర్‌పర్సన్ గంగుల వెంకటలక్ష్మి, కౌన్సిలర్లు కామిశెట్టి సత్యనారాయణ, కారింకి నాగేశ్వరరావు వెంట పాల్గొన్నారు.

ప్రమాదాల నివారణ హెచ్చరిక బోర్డుల ఏర్పాటు

దేవరపల్లి: గుండుగొలను-కొవ్వూరు జాతీయ రహదారిపై మానవత స్వచ్ఛంద సేవాసంస్థ మంగళవారం ప్రమాదాల నివారణ హెచ్చరిక బోర్డులను ఏర్పాటు చేసింది. నాలుగు ముఖ్య కూడలి ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన ఈ బోర్డులను దేవరపల్లి సీఐ అనసూరి శ్రీనివాసరావు, ఎస్సై కె.శ్రీహరిరావు ప్రారంభించారు. మానవత సంస్థ మండల శాఖ అధ్యక్షుడు బండి సూర్యప్రకాశరావు మాట్లాడుతూ దేవరపల్లి, గోపాలపురం, తాళ్లపూడి మండలాల్లోనూ ఈహెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేస్తున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో మానవత సంస్థ గౌరవాధ్యక్షుడు కేశిరాజు సీతారామయ్య, జిల్లా ప్రతినిధులు కేశిరాజు రాజ్‌కుమార్ పాల్గొన్నారు.

వేధిస్తున్న భర్త అరెస్ట్

కొవ్వూరు: భార్యను వేధిస్తున్న అభియోగంపై పట్టణానికి చెందిన గంధం పోసిబాబు అనే వ్యక్తిపై మంగళవారం కేసు నమోదు చేసినట్టు పట్టణ ఎస్సై బి.దుర్గాప్రసాద్ తెలిపారు. తాగుడుకి బానిసైన తన భర్త తనను శారీరకంగాను, మానసికంగాను వేధిస్తున్నట్టు పోసిబాబు భార్య పార్వతి ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఈ కేసు నమోదు చేసినట్టు ఎస్‌ఐ తెలిపారు.

కేసుల నమోదు

కొవ్వూరు: కొట్టుకున్న కేసులో ఇరువురిపైనా వేర్వేరు కేసులు నమోదు చేసినట్టు టౌన్ స్టేషన్ హెచ్‌సీ జె.శ్రీనివాసరావు తెలిపారు. దొమ్మేరుకు చెందిన తాతపూడి సుబ్రహ్మణ్యాన్ని అదే గ్రామానికి చెందిన వెంపల్లి దుర్గాప్రసాద్ కొట్టాడు. సుబ్రహ్మణ్యం ఇచ్చిన ఫిర్యాదుపై దుర్గాప్రసాద్‌పై కేసు నమోదు చేశారు. తనను కొట్టినట్టు దుర్గాప్రసాద్ ఫిర్యాదు చేయడంతో సుబ్రహ్మణ్యంపై కూడా కేసు నమోదు చేసినట్టు హెడ్ కానిస్టేబుల్ తెలిపారు. ఇరువురి మధ్య పాత గొడవలు ఉన్నాయని, ఒకసారి పెద్ద సమక్షంలో రాజీ పడ్డారన్నారు. మళ్లీ కుటుంబ తగాదాల విషయంలో గొడవపడి ఇరువురు ఒకర్ని ఒకరు కొట్టుకున్నారన్నారు.

సీఐ లక్ష్మారెడ్డి సస్పెన్షన్

ఏలూరు టౌన్: నల్లజర్ల సీఐగా పనిచేస్తున్న కాలంలో పలు ఆరోపణలపై వీఆర్‌లో ఉన్న లక్ష్మారెడ్డిపై సస్పెన్షన్ వేటు పడింది. ఈ మేరకు మంగళవారం ఏలూరు రేంజ్ డీఐజీ జీవీజీ అశోక్‌కుమార్ ఉత్తర్వులు జారీ చేశారు. గతంలో ఆయన నల్లజర్ల ఎస్‌హెచ్‌వోగా పనిచేస్తూ ఆరోపణలు రావటంతో ఆయన్ని ఏలూరు రేంజ్ వీఆర్‌కు పంపారు. సీఐపై వచ్చిన ఆరోపణల నేపథ్యంలో డీఐజీ అశోక్‌కుమార్ విచారణకు ఆదేశాలు జారీ చేశారు. విచారణ అనంతరం సీఐపై సస్పెన్షన్ వేటు వేస్తూ డీఐజీ ఉత్తర్వులు ఇచ్చారు.

అవినీతి రహితంగా ఇంటింటికీ సంక్షేమం

- హోం మంత్రి తానేటి వనిత
- లబ్ధిదారులకు ధ్రువీకరణ పత్రాల పంపిణీ
- ఉత్సాహంగా జగనన్న సురక్ష



కొవ్వూరు నాలుగో వార్డులో మహిళకు ధ్రువీకరణ పత్రాన్ని అందిస్తున్న మంత్రి వనిత



నిడదవోలులో లబ్ధిదారునికి సర్టిఫికెట్ అందిస్తున్న చైర్మన్ ఆదినారాయణ, కమిషనర్ పద్మావతి



కానూరులో ధ్రువీకరణ పత్రాన్ని అందిస్తున్న పెరవలి ఎంపీపీ కార్చెర్ల ప్రసాద్, అధికారులు



గోపవరంలో మహిళకు ధ్రువపత్రం అందిస్తున్న ఎంపీపీ భాగ్యలక్ష్మి, ప్రజాప్రతినిధులు

కొవ్వూరు: దళారీల ప్రమేయం లేకుండా వలంటీర్లు ఇంటింటికీ వచ్చి ప్రజల సమస్యలు తెలుసుకుని, వాటిని పరిష్కరించడం అనేది ఆంధ్రప్రదేశ్‌లో మినహా దేశంలోని మరే రాష్ట్రంలోను అమలు కావడం లేదని రాష్ట్ర హోం మంత్రి తానేటి వనిత అన్నారు. కొవ్వూరు పట్టణంలోని నాలుగో వార్డు, మండలంలోని దొమ్మేరు, కుమారదేవం గ్రామాల్లో మంగళవారం నిర్వహించిన జగనన్న సురక్ష కార్యక్రమాల్లో మంత్రి పాల్గొన్నారు. అవినీతికి ఆస్కారం లేకుండా సంక్షేమ పథకాలను అమలు చేస్తున్న ఘనత జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వానిదని ఈ సందర్భంగా మంత్రి అన్నారు. సభకు హాజరైన ప్రజల సమస్యలను మంత్రి వనిత అడిగి తెలుసుకుంటూ వాటికి అక్కడికక్కడే పరిష్కార మార్గాలు చూపారు. దొమ్మేరులో సర్పంచ్ తానేటి కుమారి, సొసైటీ అధ్యక్షుడు ముదునూరి నాగరాజు, ఏఎంసీ మాజీ చైర్మన్ బండి పట్టాభి రామారావు, ఎంపీడీవో కె.సుశీల, ఎంఈవో జె.కెంపురత్నం పాల్గొన్నారు. పట్టణంలో మునిసిపల్ చైర్‌పర్సన్ బావన రత్నకుమారి, కమిషనర్ బి.శ్రీకాంత్, వైఎస్సార్‌సీపీ మహిళా విభాగం అధ్యక్షురాలు ఏలూరి విజయ లక్ష్మి, గౌరవాధ్యక్షుడు నగళ్లపాటి శ్రీనివాస్, పాల్గొన్నారు. కుమారదేవంలో సర్పంచ్ కాసాని దుర్గ, పార్టీ మండల గౌర వాధ్యక్షుడు గన్నమని వెంకట్రాజు, ఎత్తిపోతల పథకం రైతు సంఘం అధ్యక్షుడు గోలి శ్రీనివాస్, ఉప సర్పంచ్ గద్దే రామకృష్ణ, తహసీల్దార్ బి.నాగరాజు నాయక్ పాల్గొన్నారు.

దొమ్మేరులో అమ్మఒడి ప్రారంభం

అమ్మఒడి పథకాన్ని రాష్ట్ర హోం మంత్రి తానేటి వనిత మంగళవారం దొమ్మేరు జెడ్పీ హైస్కూల్లో ప్రారంభించారు. ఈ పథకం ద్వారా మండలంలోని 35,707 మంది విద్యార్థుల తల్లుల ఖాతాలకు రూ.53.56 కోట్లు జమ చేశామన్నారు.

తాళ్లపూడి: మండలంలోని వేగేశ్వరపురం, పోచవరం గ్రామ సచివాలయాల వద్ద నిర్వహించిన జగనన్న సురక్ష కార్యక్రమాల్లో హోం మంత్రి తానేటి వనిత పాల్గొన్నారు. మొత్తం 519 ధ్రువీకరణ పత్రాలను లబ్ధిదారులకు అందజేశారు. అనంతరం గ్రామస్తులను ఏమైనా సమస్యలు ఉంటే తెలియజేయాలని మంత్రి అడిగి తెలుసుకున్నారు. వేగేశ్వరపురంలో గోదావరి నది ఒడ్డున గల ఆంజనేయ స్వామి ఆలయ సమస్యను పరిష్కరించాలని గ్రామస్తులు మంత్రిని కోరారు. ఈ సందర్భంగా మంత్రి వనిత మాట్లాడుతూ గ్రామస్తులకు నాణ్యమైన విద్యుత్తు సరఫరాకు రూ.40 లక్షల వ్యయంతో అభివృద్ధి పనులు చేపట్టామన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ జొన్నకూటి పోశిరాజు, జెడ్పీ వైస్ చైర్‌పర్సన్ పోశిన శ్రీలేఖ, మండల ప్రత్యేకాధికారి సత్యనారాయణ, సర్పంచులు కొమ్మిరెడ్డి పరశురామారావు, కాకర్ల హేమలత, ఏఎంసీ చైర్మన్ వల్లభశెట్టి శ్రీనివాస్, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ కాకర్ల వెంకటేశ్వరరావు, సొసైటీ అధ్యక్షుడు ఎం.దొరబాబు, ఎంపీటీసీ లక్ష్మణరావు, ఎంపీడీవో వెంకటరమణ, డిప్యూటీ తహసీల్దార్ అహ్మద్ పాల్గొన్నారు.

ఉండ్రాజవరం: స్థానిక సచివాలయం-2లో తహసీల్దార్ జి.కనకరాజు ఆధ్వర్యంలో జగనన్న సురక్ష శిబిరం నిర్వహించారు. కార్యక్రమంలో పాల్గొన్న నిడదవోలు ఎమ్మెల్యే శ్రీనివాస్ నాయుడు లబ్ధిదారులకు పలురకాల ధ్రువీకరణ పత్రాలు అందజేశారు. జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్ బూరుగుపల్లి సుబ్బారావు, ఎంపీపీ పాలాటి యల్లారేశ్వరి, జెడ్పీటీసీ సభ్యుడు నందిగం భాస్కరరామయ్య, మండల ప్రత్యేకాధికారి బాలస్వామి, సర్పంచ్ మెండే వెంకట్రావు, వైస్ ఎంపీపీ ఎస్.సరోజిని తదితరులు పాల్గొన్నారు.

నిడదవోలు: జగనన్న సురక్ష కార్యక్రమంలో ప్రతి సర్టిఫికెట్‌ను ఉచితంగా ఇస్తున్నామని, అర్హులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని మున్సిపల్ చైర్మన్ భూపతి ఆదినారాయణ సూచించారు. పట్టణంలోని టక్కరిబాబాపేట వార్డు సచివాలయంలో నిర్వహించిన జగనన్న సురక్ష శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సచివాలయం పరిధిలోని 25, 27 వార్డుల వారికి 240 కుల ధ్రువీకరణ పత్రాలు, 228 ఆదాయ ధ్రువీకరణ పత్రాలు అందజేశారు. ఇక్కడ ఏర్పాటు చేసిన ఆధార్ కేంద్రంలో 50 మందికి ఆధార్ అనుసంధానం చేశారు. కార్యక్రమంలో కమిషనర్ కేవీ పద్మావతి, జేసీఎస్ టౌన్ కన్వీనర్ ఎస్కే చాన్‌బాషా, వైస్ చైర్‌పర్సన్ గంగుల వెంకటలక్ష్మి, కౌన్సిలర్లు తేటీటి ఝాన్సీ, కామిశెట్టి సత్యానారాయణ, ఎస్కే వజీరుద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

నిడదవోలు రూరల్: మండలంలోని గోపవరం, పెండ్యాల గ్రామాల్లో జగనన్న సురక్ష కార్యక్రమాలు నిర్వహించారు. సచివాలయ వద్ద ఏర్పాటు చేసిన ప్రత్యేక వినతుల పరిష్కార డెస్క్ వద్ద ప్రజల నుంచి అందిన 1,468 వినతులను తక్షణమే పరిష్కరించారు. ప్రజలకు అవసరమైన 11 రకాల సర్టిఫికెట్లను లబ్ధిదారులకు అందజేశారు.ఎంపీపీ తిరుమళ్ల భాగ్యలక్ష్మి, జెడ్పీటీసీ కొయ్యే సూరిబాబు, జేసీఎస్ మండల కన్వీనర్ వెలగన పోలయ్య, మాజీ ఎంపీపీ మన్యం సూరిబాబులు పర్యవేక్షించారు. కార్యక్రమాల్లో ఎంపీడీఓ పి.శామ్యేలు, తహసీల్దార్ ఎం.గంగరాజు. సర్పంచులు కారింకి అన్నవరం, ఆరేపల్లి భాగ్యలక్ష్మి, వెలగన నరేష్, ఎంపీటీసీ కర్రి సుజాత, వైఎస్సార్ సీపీ నాయకులు పాల్గొన్నారు.

పెరవలి: జగనన్న సురక్ష కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని పెరవలి ఎంపీపీ కార్చెర్ల ప్రసాద్ అన్నారు. మండలంలోని కానూరు, నడుపల్లి గ్రామాల్లో మంగళవారం జగనన్న సురక్ష శిబిరాలు నిర్వహించారు. వివిధ రకాల ధ్రువీకరణ పత్రాలు కావాలంటూ ప్రజల నుంచి కానూరులో 845, నడుపల్లిలో 1063 దరఖాస్తులు అందాయి. అధికారులు వెంటనే వాటిని పరిశీలించి, వివిధ ధ్రువీకరణ పత్రాలు అందించారు. కార్యక్రమాల్లో తహసీల్దార్ టి.రాజరాజేశ్వరి, ఎంపీడీఓ దామోదరరావు, వైఎస్సార్ సీపీ మండల శాఖ అధ్యక్షుడు వీరమళ్ళు సత్యనారాయణ, గృహసారథుల సంఘం మండల శాఖ అధ్యక్షుడు రామడుగుల సూర్యనారాయణ, డిప్యూటీ తహసీల్దార్ కనకదుర్గ, కానూరు సర్పంచ్ బావన మధు, నడుపల్లి సర్పంచ్ బీరా సత్యవేణి రాజు, ఎంపీటీసీ సభ్యురాలు అనంతలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

చాగల్లు: మండలంలోని ఎస్.ముప్పవరం, మల్లవరం గ్రామాల్లో జగనన్న సురక్ష శిబిరాలు నిర్వహించారు. ఎస్.ముప్పవరం కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ రైతు విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆత్కూరి దొరయ్య, మండల శాఖ అధ్యక్షులు చెల్లింకుల దుర్గామల్లేశ్వరరావు పాల్గొన్నారు. మల్లవరం సచివాలయంలో 843 మందికి, ఎస్. ముప్పవరం సచివాలయంలో 365 మందికి వివిధ ధ్రువీకరణ పత్రాలు అందజేశారు.ఎంపీడీవో బి.రాంప్రసాద్, తహసీల్దార్ కె.రాజ్యలక్ష్మి, సర్పంచులు ముప్పిడి మహాక్ష్ముడు, కె.లక్ష్మిసుభాషిణి పాల్గొన్నారు.

దుద్దుకూరులో 1058 అర్జీలు

దేవరపల్లి: మండలంలోని దుద్దుకూరు సచివాలయం వద్ద ఎంపీడీఓ డీబీఆర్ అంబేద్కర్ ఆధ్యక్షతన నిర్వహించిన జగనన్న సురక్ష సభలో ఎమ్మెల్యే తలారి వెంకట్రావు ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. తహసీల్దార్ రామకృష్ణ మాట్లాడుతూ గ్రామంలోని రెండు గ్రామ సచివాలయాల పరిధిలో 1058 అర్జీలు వచ్చాయన్నారు. వాటిని ఆన్‌లైన్ చేసి ధ్రువీకరణ పత్రాలు మంజూరు చేసినట్టు చెప్పారు. సభలో లబ్ధిదారులకు వివిధ రకాల ధ్రువీకరణ పత్రాలను ఎమ్మెల్యే తలారి వెంకట్రావు చేతుల మీదుగా అందజేశారు. సర్పంచ్ బొంతా నాగమణి, సొసైటీ అధ్యక్షుడు కాండ్రు రామకృష్ణ, ఎంపీపీ కేవీకే దుర్గారావు, జెడ్పీటీసీ సభ్యురాలు పొట్టి స్వర్ణలత, ఏఎంసీ చైర్మన్ గన్నమని జనార్దనరావు, వైస్ ఎంపీపీ సాదే సుబ్బారావు, మండల ప్రత్యేకాధికారి జి. రాధాకృష్ణ, పార్టీ మండలశాఖ అధ్యక్షుడు కూచిపూడి సతీష్ తదితరులు పాల్గొన్నారు.

దేవరపల్లి: గోపాలపురం మండలం దొండపూడి, గుడ్డిగూడెం గ్రామాల్లో నిర్వహించిన జగనన్న సురక్ష కార్యక్రమాల్లో ఎమ్మెల్యే తలారి వెంకట్రావు పాల్గొన్నారు. లబ్ధిదారులకు వివిధ రకాల ధ్రువీకరణ పత్రాలను ఎమ్మెల్యే చేతుల మీదుగా అందజేశారు. సర్పంచులు మడిచర్ల ప్రసాద్, మల్లిపూడి అచ్చయ్య, రాష్ట్ర అతిరాస కార్పొరేషన్ చైర్మన్ ఇళ్ల భాస్కరరావు, ఎంపీపీ ఉండవల్లి సత్యనారాయణ, మండల ప్రత్యేకాధికారి సత్యగోవింద్, ఎంపీడీఓ ఆర్.శ్రీదేవి, జెడ్పీటీసీ సభ్యురాలు కాకులపాటి లలిత, తహల్దార్ రవీంద్రనాథ్ పాల్గొన్నారు.

జగనన్న సురక్షతో విప్లవాత్మక మార్పు

- ఎమ్మెల్యే తలారి వెంకట్రావు
- ప్రకాశరావుపాలెం, అనంతపల్లిలలో గ్రామసభలు
- హాజరైన జాయింట్ కలెక్టర్ తేజ్‌భరత్



నల్లజర్ల మండలం ప్రకాశరావుపాలెంలో లబ్ధిదారులకు ధ్రువీకరణ పత్రాలు అందిస్తున్న ఎమ్మెల్యే తలారి, జేసీ తేజ్ భరత్

నల్లజర్ల: జగనన్న సురక్ష కార్యక్రమంతో గ్రామాల్లో విప్లవాత్మక మార్పులకు రాష్ట్ర ప్రభుత్వం శ్రీకారం చుట్టిందని గోపాలపురం ఎమ్మెల్యే తలారి వెంకట్రావు అన్నారు. మండలంలో ప్రకాశరావుపాలెం, అనంతపల్లి గ్రామ సచివాలయాల పరిధిలో మంగళవారం జగనన్న సురక్ష కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కుల, ఆదాయ ధ్రువపత్రాలు, రేషన్ కార్డులలో మార్పులు, చేర్పుల వంటివి సులభతరం చేస్తూ ప్రభుత్వ వ్యవస్థను ప్రజలకు చేరువ చేసిందన్నారు. జాయింట్ కలెక్టర్ తేజ్ భరత్ మాట్లాడుతూ ప్రభుత్వ సేవలను ప్రజల వద్దకు చేర్చే బృహత్తర కార్యక్రమం జగనన్న సురక్ష అన్నారు. ప్రకాశరావుపాలెంలో 700, అనంతపల్లిలో 590 మందికి వివిధ రకాల ధ్రువపత్రాలు ఎమ్మెల్యే, జాయింట్ కలెక్టర్ అందజేశారు. కార్యక్రమాల్లో తహసీల్దార్ కిశోర్‌కుమార్, ఎంపీడీఓ రాజశేఖర్, ఎంపీపీ బంక జయలక్ష్మి, సొసైటీ అధ్యక్షుడు కారుమంచి రమేష్, పార్టీ మండల కన్వీనర్ గగ్గర శ్రీనివాస్, సర్పంచులు జాన్ విక్టర్, వెంగల కమలకుమారి, కలం సత్యనారాయణ, ఎంపీటీసీ సభ్యులు పాల్గొన్నారు.

అల్లూరి మహోజ్వల శక్తి

- హోం మంత్రి తానేటి వనిత
- సీతారామరాజు జయంతి సందర్భంగా ఘన నివాళి



దొమ్మేరులో అల్లూరి విగ్రహానికి పూలమాల వేసి నివాళి అర్పిస్తున్న హోం మంత్రి తానేటి వనిత



ఉండ్రాజవరం మండలం వెలగదుర్రులో..



నిడదవోలు మండలం పెండ్యాల గ్రామంలో..

కొవ్వూరు: భారతదేశ స్వాతంత్ర్యోద్యమ చరిత్రలో విప్లవ వీరుడు అల్లూరి సీతారామరాజు ఒక మహోజ్వల శక్తి అని రాష్ట్ర హోం మంత్రి తానేటి వనిత అన్నారు. మంగళవారం అల్లూరి జయంతి సందర్భంగా దొమ్మేరు గ్రామంలోని ఆయన విగ్రహానికి మంత్రి పూలమాల వేసి నివాళి అర్పించారు. స్వాతంత్ర్య పోరాటంలో అల్లూరి రగిలించిన స్ఫూర్తిని కొనియాడారు. కార్యక్రమంలో దొమ్మేరు సర్పంచ్ తానేటి కుమారి, సొసైటీ అధ్యక్షుడు ముదునూరి నాగరాజు, ఏఎంసీ మాజీ చైర్మన్ బండి పట్టాభి రామారావు, పలువురు వైఎస్సార్ సీపీ నాయకులు పాల్గొన్నారు. అలాగే అల్లూరి జయంతిని కొవ్వూరు మెయిన్ రోడ్డులో ఘనంగా నిర్వహించారు. గోదావరి మాత క్షత్రియ సేవాసమితి ఆధ్వర్యంలో అల్లూరి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. పేదలకు అన్నదానం చేశారు. క్షత్రియ సంఘం అధ్యక్షుడు చెరుకూరి సాయిరాజు, కార్యదర్శి సాగిరాజు సుబ్బరాజు, ఉపాధ్యక్షుడు పి.గణపతి మూర్తిరాజులతో పాటు గోవర్ధనం శ్రీనివాసమూర్తి, మడిచర్ల రామచంద్రరావు, డీఎస్పీ వీఎస్ఎన్ వర్మ, పట్టణ సీఐ వి.జగదీశ్వరరావు తదితరులు పాల్గొన్నారు. లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు కలగర వెంకట్రావు, పెనుమాక జయరాజు, ఉప్పులూరి రామకృష్ణ, పాకా శ్రీనివాస్, కంతమణి రామ కిషోర్, ఎండీ హుస్సేన్, మన్యం బుల్లిబాబు తదితరులు పాల్గొన్నారు.

ఉండ్రాజవరం: మండలంలోని వెలగదుర్రు, సత్యవాడ, మోర్త గ్రామాల్లో అల్లూరి జయంతిని ఘనంగా నిర్వహించారు. అల్లూరి విగ్రహనికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. వెలగదుర్రులో క్షత్రియ సేవాసంఘం, మోర్తలో పెరవలి లయన్స్ క్లబ్, సత్యవాడలో క్షత్రియ యూత్ సభ్యుల ఆధ్వర్యంలో జయంతి నిర్వహించారు. పెరవలి లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో మోర్త ఉన్నత పాఠశాల విద్యార్థులకు వక్తృత్వ పోటీలు నిర్వహించారు. ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచిన ఎస్.పార్థునందన్, జె.ప్రసన్నలక్ష్మి, ఎస్.మహిమా జ్యోతిలకు జ్ఞాపికలు అందజేశారు. విద్యార్థులకు స్వీట్లు పంపిణీ చేసారు. హెచ్‌ఎం కె.శ్రీనివాసు, కోలా సీతయ్య నాయుడు, సలాది భాస్కరరావు, శిరిగినీడి శేషగిరి రావు, డాక్టర్ ముదునూరి సుబ్బరాజు, సతీష్‌వర్మ, రవీంద్రరాజు, సాగి శ్రీనివాసరాజు పాల్గొన్నారు.

నిడదవోలు రూరల్: సింగవరం, పెండ్యాల గ్రామాల్లో అల్లూరి సీతారామరాజు జయంతిని ఘనంగా నిర్వహించారు. క్షత్రియ సేవా సమితి ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో అల్లూరి విగ్రహానికి సింగవరం సొసైటీ అధ్యక్షుడు పెన్మెత్స చందు పూలమాల వేసి నివాళులర్పించారు. పెండ్యాల కార్యక్రమంలో సర్పంచ్ కారింకి అన్నవరం, వైఎస్సార్ సీపీ గ్రామ శాఖ అధ్యక్షుడు ఉప్పులూరి రామకృష్ణాంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

నిడదవోలు: బీజేపీ ఆధ్వర్యంలో స్థానిక గాంధీ నగర్‌లో అల్లూరి జయంతిని నిర్వహించారు. అల్లూరి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. బీజేపీ పట్టణశాఖ అధ్యక్షుడు నీలం రామారావు మాట్లాడుతూ, జీవీ రమణ, గొన్నాబత్తుల విజయకృష్ణ, సూర్యనారాయణమూర్తి, చల్లపల్లి మురళీకృష్ణ, విజయ్‌కుమార్, ప్రేమకుమార్ పాల్గొన్నారు.

చాగల్లు: స్థానిక జెడ్పీ హైస్కూల్, చంద్రవరం శాఖా గ్రంథాలయాల్లో అల్లూరి చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా స్వీట్లు పంచారు. కార్యక్రమంలో హెచ్‌ఎం పి.వీర్రాజు, లైబ్రేరియన్ గద్దే శ్రీనివాసరావు, కె.సుమన్‌కుమార్, గ్రంథాలయ కమిటీ సభ్యులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నల్లజర్ల: లయన్స్ క్లబ్ దూబచర్ల శాఖ ఆధ్వర్యంలో దూబచర్ల గ్రామంలో అల్లూరి జయంతిని నిర్వహించారు. మన్యంలో 35 ఏళ్ల పాటు ఉపాధ్యాయుడిగా పనిచేసిన అల్లూరి రామచంద్రరావును క్లబ్ అధ్యక్షుడు అంబటి శ్రీనివాసరావు సత్కరించారు. కాళ్ళ మురళీకృష్ణ, నెక్కంటి వెంకటేష్, సీమకుర్తి కృష్ణప్రసాద్ పాల్గొన్నారు.

దేవరపల్లి: దేవరపల్లిలోని అల్లూరి సీతారామరాజు విగ్రహానికి ఎంపీపీ కేవీకే దుర్గారావు పూలమాల వేసి నివాళులు అర్పించారు. ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు స్వీట్లు పంపిణీ చేశారు. అల్లూరి పోరాట పటిమను కొనియాడారు. కార్యక్రమంలో సర్పంచ్ కడిమి వీరకుమారి, వైఎస్సార్ సీపీ గ్రామ కమిటీ అధ్యక్షుడు దుగ్గిన గంగాధర్, సొసైటీ అధ్యక్షుడు కవల శ్రీనివాస్ పాల్గొన్నారు.

వంగవీటికి ఘనంగా నివాళి

- కాపు సంఘాల ఆధ్వర్యంలో జయంతి
- కొవ్వూరులో పేదలకు అన్నదానం



దేవరపల్లిలో రంగా విగ్రహానికి నివాళులు



కొవ్వూరు మెరకవీధిలో..

కొవ్వూరు: కాపు ఉద్యమ నేత వంగవీటి మోహన్‌రంగా 76 జయంతిని మంగళవారం ఘనంగా నిర్వహించారు. పట్టణంలోని క్యాంపు కార్యాలయంలో హోం మంత్రి తానేటి వనిత రంగా చిత్ర పటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. వైఎస్సార్ సీపీ జిల్లా స్టీరింగ్ కమిటీ మాజీ సభ్యుడు మైపాల రాంబాబు, పట్టణశాఖ గౌరవాధ్యక్షుడు నగళ్ల పాటి శ్రీనివాస్, వైఎస్సార్ సీపీ యువజన, ప్రచార విభాగం జిల్లా అధ్యక్షుడు చొటుపల్లి వీరన్న పూలు వేసి రంగాకు నివాళులు అర్పించారు. మెరక వీధి వాటర్ ట్యాంకు జంక్షన్‌లోని రంగా విగ్రహానికి కాపు సంఘం నేతలు పూలమాలలు వేసి శ్రద్ధాంజలి అర్పించారు. కాపవరం, పెనకనమెట్ట, మద్దూరు, దొమ్మేరు గ్రామాల్లో రంగా విగ్రహాలకు పూలమాలలు వేసి నాయకులు నివాళులు అర్పించారు. పట్టణంలో టాక్సీస్టాండ్ వద్ద కాపు యువత ఆధ్వర్యంలో పేదలకు అన్నదానం చేశారు. పట్టణ కాపు యువత ఆధ్వర్యంలో రంగా చిత్ర పటాలతో పట్టణంలో ర్యాలీ చేశారు. దొమ్మేరులో సొసైటీ అధ్యక్షుడు ముదునూరి నాగరాజు, ఏఎంసీ మాజీ చైర్మన్ బండి పట్టాభి రామారావు, కొమ్మన మణిబాబు, పెరుమాళ్ల ఉమామహేశ్వరావు,తోట నారాయణ పాల్గొన్నారు. పట్టణంలోని మెరకవీధిలో నిర్వహించిన రంగా జయంతి వేడుల్లో పలువురు ఆయన విగ్రహానికి నివాళులు అర్పించారు.

దేవరపల్లి: స్థానిక మూడు బొమ్మల సెంటర్లోని వంగవీటి మోహన్ రంగా విగ్రహానికి ఎంపీపీ కేవీకే దుర్గారావు, సర్పంచ్ కడిమి వీరకుమారి, కాపు సంఘం నాయకులు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఎంపీపీ దుర్గారావు కేక్‌కట్ చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ గ్రామ కమిటీ అధ్యక్షుడు దుగ్గిన గంగాధర్, సొసైటీ అధ్యక్షుడు కవల శ్రీనివాస్, పాల్గొన్నారు. జనసేన పార్టీ ఆధ్వర్యంలో మోహన్‌రంగా జయంతి వేడుకలు నిర్వహించారు. నియోజకవర్గ పార్టీ కన్వీనర్ దొడ్డిగర్ల సువర్ణరాజు మోహన్‌రంగా విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు.

పెరవలి: కానూరు గ్రామంలోని వంగవీటి మోహన రంగా విగ్రహానికి ఎంపీపీ కార్చెర్ల ప్రసాద్ క్షీరాభిషకం చేశారు. అనంతరం పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా రంగా అభిమానుల సమక్షంలో భారీ కేక్ కేక్ కట్ చేశారు. రంగా అమర్ రహే అంటూ నినాదాలు చేశారు. స్వీట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో కొమ్మిశెట్టి రాము, ఆనం సుబ్బారావు, తోట సురేష్, అంబటి బ్రహ్మయ్య పాల్గొన్నారు.

తాళ్లపూడి: వేగేశ్వరపురం, పెద్దేవం, అన్నదేవరపేట, తాళ్లపూడి తదితర గ్రామాల్లో కాపుసంఘం, కాపు యూత్ ఆధ్వర్యంలో వంగవీటి మోహనరంగా జయంతిని నిర్వహించారు. కేక్ కట్ చేశారు.

సంక్షేమ పాలనకు అండగా నిలవాలి

- హోం మంత్రి తానేటి వనిత
- రెండుచోట్ల గడప గడపకూ..
- పాల్గొన్న నిడదవోలు ఎమ్మెల్యే శ్రీనివాస్ నాయుడు



కొవ్వూరు ఒకటో వార్డులో సమస్యలు తెలుసుకుంటున్న మంత్రి తానేటి వనిత



తాడిపర్రులో సంక్షేమ పథకాల బుక్‌లెట్ అందిస్తున్న ఎమ్మెల్యే శ్రీనివాస్‌నాయుడు

కొవ్వూరు: పార్టీ రహితంగా, కులమతాలకు అతీతంగా అర్హతే ప్రామాణికంగా ప్రతి కుటుంబానికీ సంక్షేమ పథకాల ఫలాలు అందిస్తున్న వైఎస్సార్ సీపీ ప్రభుత్వానికి అండగా నిలవాలని రాష్ట్ర హోం మంత్రి తానేటి వనిత కోరారు. మంగళవారం రాత్రి పట్టణంలో ఒకటో వార్డులో ఆమె గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం ద్వారా అందిస్తున్న సంక్షేమ పథకాలు, ఆయా కుటుంబాలకు ఇప్పటి వరకు చేకూరిన లబ్ధిని లెక్కలతో సహా మంత్రి వివరించారు. స్థానికుల నుంచి సమస్యలు అడిగి తెలుసుకుంటూ, ప్రభుత్వం చేస్తున్న మేలుని వివరిస్తూ ముందుకి సాగారు. జెడ్పీ వైస్ చైర్ పర్సన్ పోసిన శ్రీలేఖ, ఏఎంసీమాజీ చైర్మన్ బండి పట్టాభి రామారావు, స్థానిక నాయకులు పిక్కి శ్రీనివాస్, యజ్జల శ్రీనివాస్, మాసా ఆనంద్, పార్టీ పట్టణ గౌరవాధ్యక్షుడు నగళ్లపాటి శ్రీనివాస్, మహిళా అధ్యక్షురాలు ఏలూరి విజయలక్ష్మి, పలువురు కౌన్సిలర్లు పాల్గొన్నారు.

పేదల అభ్యున్నతే ధ్యేయం

ఉండ్రాజవరం: పేదల సంక్షేమం, రాష్ట్ర అభివృద్ధే ధ్యేయంగా సీఎం జగన్ పనిచేస్తున్నారని నిడదవోలు ఎమ్మెల్యే జి.శ్రీనివాస్‌నాయుడు అన్నారు. మండలంలో తాడిపర్రు గ్రామంలో మంగళవారం నాలుగో రోజు గడప గడపకూ మన ప్రభుత్వ కార్యక్రమం నిర్వహించారు. ఎమ్మెల్యే సచివాలయ సిబ్బంది, వలంటీర్లు, అధికారులు, ప్రజాప్రతినిధులతో కలిసి ప్రతి ఇంటికీ వెళ్ళి గత నాలుగేళ్లలో ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను వివరించారు. ముఖ్యమంత్రి సందేశంతో కూడిన బుక్‌లెట్‌ను ప్రతి ఇంటికీ అందజేశారు. సమస్యలు అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యుడు కట్టా వెంకటేశ్వరరావు, పార్టీ గ్రామ శాఖ అధ్యక్షుడు కరుటూరి వెంకటేశ్వరరావు, సొసైటీ అధ్యక్షులు అక్కిన రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.